క్లుప్తంగా

12న ఇసుకకొండపై పౌర్ణమి పూజలు



రమా సహిత సత్యనారాయణ స్వామి

దాబాగార్డెన్స్: ఇసుకకొండపై వెలసిన రమా సహిత సత్యనారాయణ స్వామి ఆలయంలో ఈ నెల 12న చైత్ర పౌర్ణమిని పురస్కరించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు. ఆ రోజు వేకువ జాము 2.30 గంటలకు స్వామి ఆరాధనాది కార్యక్రమాల అనంతరం ఉదయం 4 గంటలకు ధ్వజస్తంభ పూజలు జరపనున్నారు. 4.30 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు, తిరిగి సాయంత్రం 4.30 నుంచి రాత్రి 10.30 గంటల వరకు స్వామి దర్శనం కల్పించనున్నారు. స్వామి ప్రత్యేక వ్రతంలో పాల్గొనదలిచే దంపతులు రూ.1,116 పూజా రుసుం చెల్లించాలి. సామూహిక వ్రతంలో పాల్గొనదలిచే భక్తులు రూ.516 చెల్లించి పాల్గొనవచ్చు.

కేజీహెచ్ ఓపీ రోడ్డు మూసివేత..

కేజీహెచ్ నుంచి ఆలయానికి వచ్చే వాహన మార్గం మూసివేశారు. పూర్ణామార్కెట్‌కు ఎదురుగా నూతనంగా నిర్మించిన ఘాట్ రోడ్డు నుంచి మాత్రమే ఆలయానికి చేరుకుని, స్వామిని దర్శించుకోవాలని ఆలయ ఈవో టి. రాజగోపాల్‌రెడ్డి తెలిపారు.

13న భువనేశ్వరీదేవికి వేప పత్రితో అధివాసం



భువనేశ్వరీదేవి

దాబాగార్డెన్స్: సబ్బవరం చెల్లాయమ్మ తోటలో వేంచేసిన భువనేశ్వరీదేవి ఆరాధన పీఠంలో ఈ నెల 13న భువనేశ్వరీదేవికి వేప పత్రితో అధివాసం నిర్వహించనున్నట్టు ఓం భువనేశ్వరి సంస్థాన్ ట్రస్ట్ నిర్వాహకుడు మురళీకృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. శాకంబరీదేవి, జగదీశ్వరి, త్రిశక్తి స్వరూపిణికి ఆ రోజు ఉదయం వేప పత్రితో వేదపండితులచే దివ్య పంచామృతాలు, పాలు, సుగంధంతో శుద్ధి చేసి అలంకరణ అనంతరం పూజలు చేయనున్నట్టు చెప్పారు.

అభాగ్యుడికి ఆశ్రయం



షెల్టర్‌లో సత్యనారాయణ

సీతమ్మధార: నర్సీపట్నానికి చెందిన సత్యనారాయణ (64)కు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. అయితే కుటుంబ సభ్యులు అతన్ని పట్టించుకోకపోవడంతో అనాథలా రోడ్ల మీద తిరుగుతున్నాడు. గురువారం ఏయూటీడీ సిబ్బంది ఫీల్డ్ సందర్శనలో భాగంగా ఆర్టీసీ కాంప్లెక్స్ బస్ బే దగ్గర అతన్ని గుర్తించారు. అతని వివరాలు తెలుసుకుని షెల్టర్‌లో అతనికి ఆశ్రయం కల్పించారు.

ట్రాఫిక్ నిబంధనలు విధిగా పాటించాలి



అక్కయ్యపాలెం హైవేపై ప్లకార్డులతో అవగాహన కల్పిస్తున్న ట్రాఫిక్ పోలీసులు, విద్యార్థులు

సీతమ్మధార: విద్యార్థి దశ నుంచే ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన పెంచుకోవాలని ఫోర్త్ టౌన్ ఈస్ట్ ట్రాఫిక్ సీఐ అమ్మి నాయుడు అన్నారు. సుప్రీం కోర్టు ఆదేశాల మేరకు పెన్ స్కూల్ సౌజన్యంతో గురువారం అక్కయ్యపాలెం జాతీయ రహదారి వద్ద విద్యార్థులతో కలిసి వాహన చోదకులకు ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ ఇటీవల నిర్వహిస్తున్న స్పెషల్ డ్రైవ్‌ల వల్ల వాహన చోదకుల్లో మార్పు వచ్చిందన్నారు. రోడ్డు నిబంధనలు పాటించడం వల్ల ప్రమాదాలను సైతం నివారించవచ్చని చెప్పారు. ప్రతి ఒక్కరూ విధిగా ట్రాఫిక్ నిబంధనలు పాటించి ట్రాఫిక్ పోలీసులకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో ఎస్ఐ వాణిశ్రీ, సిబ్బంది పాల్గొన్నారు.

రామలింగేశ్వరుడికి ప్రత్యేక పూజలు



సీతమ్మధార: త్రయోదశి సందర్భంగా సీతమ్మధార నార్త్ ఎక్స్‌టెన్షన్‌లోని మహాగణపతి, ప్రసన్న వేంకటేశ్వర స్వామి, అయ్యప్ప, షిర్డీసాయి బాబా దేవాలయంలో కొలువైన రామలింగేశ్వర స్వామికి గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. పంచామృతాభిషేకం, భక్తుల గోత్ర నామాలతో విశేష పూజలు చేశారు. భక్తిశ్రద్ధలతో భక్తులు దీపాలు వెలిగించారు.



అందరికీ ఇష్టం.. ఈ వేసవి నేస్తం

ఎండా కాలంలో చిన్నాపెద్దా ఇష్టంగా తినే పుచ్చకాయలు

ఆరోగ్య పరిరక్షణలో మేటి

ఈ ఏడాది పసుపు రంగు పుచ్చకాయ పలకరింపు

జగదాంబ: ఎండాకాలంలో అందరినీ పలుకరించే నేస్తం పుచ్చకాయ. మండే ఎండల్లో బయటికి వెళ్లేవారు ఎక్కడో ఒకచోట ఆగి తప్పనిసరిగా పుచ్చకాయ ముక్కలు తినకుండా ఉండలేరు. తియ్యగా.. పుష్కలంగా నీటితో నిండి ఉండే పుచ్చకాయను ఇష్టపడని వారు అసలు ఉండనే ఉండరు. చిన్నాపెద్దా అంతా దీన్ని ఇష్టపడతారు. పుచ్చకాయ జన్మస్థానం కచ్చితంగా ఎక్కడో తెలియకపోయినా ఈజిప్టులో దీన్ని 5 వేల సంవత్సరాల క్రితమే పండించినట్లు ఆధారాలున్నాయి. విటమిన్ బి, పొటాషియం పుష్కలంగా లభ్యమయ్యే పుచ్చకాయల్లో ఎలక్ట్రోలైట్స్ కూడా మెండుగా ఉంటాయని వైద్యులు చెబుతున్నారు. దీనివల్ల శరీరానికి, గుండెకు మేలు జరుగుతుంది.

భారీ ఎత్తున వ్యాపారం..

నియోజకవర్గంలో పలుచోట్ల పుచ్చకాయల విక్రయాలు జోరుగా సాగుతున్నాయి. డైమండ్ పార్క్, న్యూకాలనీ, తాటిచెట్లపాలెం, అల్లిపురం, డాబాగార్డెన్స్, పూర్ణామార్కెట్, రామకృష్ణా బజార్, వన్‌టౌన్ తదితర ప్రాంతాల్లో వ్యాపారులు భారీ ఎత్తున పుచ్చకాయలు దిగుమతి చేసుకుని వ్యాపారం చేస్తున్నారు. రోడ్డు పక్కన అందరికీ అందుబాటులో ఉండే విధంగా వీటిని విక్రయిస్తున్నారు. సీజన్ కనుక ఇతర వ్యాపారాల కన్నా పుచ్చకాయల వ్యాపారం వైపే అంతా మొగ్గు చూపుతున్నారు.



పసుపు రంగు పుచ్చకాయలు..

ఈ ఏడాది మార్కెట్‌లో పసుపు రంగు పుచ్చకాయ దర్శనం ఇచ్చింది. ఇది చూడడానికి కాస్త విచిత్రంగా ఉంది. అయితే సాధారణ పుచ్చకాయలపై చూపుతున్న ఆసక్తి వీటిపై వినియోగదారులు చూపడంలేదు. ఎరుపు రంగు పుచ్చకాయలు తమిళనాడు, తిరుపతిలోని పలు ప్రాంతాలు, శ్రీకాకుళం, ఒడిశా, భద్రాచలం తదితర ప్రాంతాల నుండి నగరానికి వస్తే పసపు రంగు పుచ్చకాయలు మహారాష్ట్ర, తెలంగాణ నుండి వస్తున్నట్లు వ్యాపారులు చెబుతున్నారు.



ఎన్ని రకాలో..

ప్రపంచవ్యాప్తంగా 1200 రకాల పుచ్చకాయల్ని రైతులు పండిస్తున్నారు. వాటిలో విరివిగా దొరికేవి నూర్జహాన్, షర్బత్–ఎ–అనార్, అనార్కలీ, షుగర్బేబి (మహారాష్ట్రలోని అమెరికా రకం), అసాహీ యమటో (పశ్చిమ బెంగాల్లోని జపాన్ రకం), నందారి (ఆంధ్రప్రదేశ్‌లో పండించే రకం), రెడ్ టైగర్, ఆల్ స్వీట్, వాల్ పెయింట్.



పెరిగిన ధర..

గతంలో కిలోల లెక్కన అమ్మినప్పుడు కిలో రూ. 20 చొప్పున పుచ్చకాయ ఎన్ని కిలోల బరువుంటే అంత ధరకు విక్రయించేవారు. ఇప్పుడు కిలో రూ. 30కి విక్రయిస్తున్నారు. అయితే ధర పెరిగినా పోషకాలు మెండుగా ఉండే పుచ్చకాయను తప్పనిసరిగా వినియోగదారులు కొనుగోలు చేస్తున్నారు.

కళాకారులకు సహకారం అందిస్తాం



వీఎంఆర్‌డీఏ చైర్మన్ ప్రణవ్‌గోపాల్‌ను సత్కరిస్తున్న సంఘం ప్రతినిధులు

దాబాగార్డెన్స్: భవిత బాటకు కళలు బాష్యం చెబుతాయని వీఎంఆర్‌డీఏ చైర్మన్ ఎంవీ ప్రణవ్‌గోపాల్ పేర్కొన్నారు. వీజేఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో గురువారం విశాఖ కళాకారుల సంక్షేమ సేవా సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రతిభావంతుల ప్రోత్సాహ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. సమాజంలో చోటు చేసుకుంటున్న అంశాలపై ప్రజల్లో అవగాహన కల్పించడంతో పాటు జన జాగృతికి కళలు ఎంతో తోడ్పడుతున్నాయన్నారు. జిల్లాలోని ప్రతిభావంతులైన ఎంతో మంది కళాకారులున్నారని, ఎన్నో సందర్భాల్లో వీఎంఆర్‌డీఏ వీరిని ప్రోత్సహించిందన్నారు. ప్రభుత్వ పరంగా కళాకారులకి తగిన సహకారమందిస్తామన్నారు. కళాకారుల సంక్షేమ సేవా సంఘం గౌరవ అధ్యక్షుడు, జాతీయ జర్నలిస్టుల సంఘం కార్యదర్శి గంట్ల శ్రీనుబాబు మాట్లాడుతూ ప్రతిభావంతులను జిల్లా యంత్రాంగం మరింతగా ప్రోత్సహించాల్సి ఉందన్నారు. ఈ సందర్భంగా 35వ వార్డు శానిటరీ ఇన్‌స్పెక్టర్ సింగూరు సత్యనారాయణ, ఓలేసి ప్రసాద్‌ను సత్కరించారు. కార్యక్రమంలో సంస్థ ప్రధాన సలహాదారుడు, కొరియోగ్రాఫర్ నాగరాజ్ పట్నాయక్, విశాఖ జిల్లా కళాకారుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు క్యాలు జనార్దన్, సినీ దర్శకుడు యాద కుమార్, నంది అవార్డు గ్రహీత శివజ్యోతి, ప్రజాపిత బ్రహ్మకుమారి ఈశ్వరీయ విశ్వ విద్యాలయం ప్రతినిధి బీకే రామేశ్వరి, కీరవాణి ప్రసాద్, ధనుంజయ, తాళ్లపాక సందీప్, పక్కి అరుణ్‌సాయి తదితరులు పాల్గొన్నారు.

ద్వారకా బస్ స్టేషన్‌లో చలివేంద్రం ప్రారంభం



చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఏపీఎస్ఆర్టీసీ ప్రాంతీయ మేనేజర్ అప్పలనాయుడు

దాబాగార్డెన్స్: ఏపీఎస్ఆర్టీసీ ద్వారకా బస్ స్టేషన్‌లో వేసవి తీవ్రత దృష్ట్యా ప్రయాణికుల సౌకర్యార్థం చలివేంద్రం ఏర్పాటు చేశారు. సంస్థ ప్రాంతీయ మేనేజర్ బి. అప్పలనాయుడు గురువారం చలివేంద్రాన్ని ప్రారంభించి మాట్లాడారు. సిబ్బంది సహకారంతో చలివేంద్రాన్ని ప్రారంభించినట్టు చెప్పారు. సిటీ పరిధిలో గల అన్ని బస్ స్టేషన్ల వద్ద చలివేంద్రాలు అందుబాటులో ఉంటాయన్నారు. దాతలు సహకరించి చలివేంద్రాల ఏర్పాటు విషయమై ముందుకు రావాలని కోరారు. కార్యక్రమంలో ద్వారకా బస్ స్టేషన్ డిప్యూటీ సీటీఎం జి. సత్యనారాయణ, ఏటీఎం పీబీఎంకే రాజు సిబ్బంది, సూపర్‌వైజర్లు, ప్రయాణికులు తదితరులు పాల్గొన్నారు.

జాబ్‌ఫెస్ట్–2025లో 123 మందికి ఉపాధి



విద్యార్థులనుద్దేశించి మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ డాక్టర్ మంజుల

దాబాగార్డెన్స్: విశాఖ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో గురువారం జాబ్‌ఫెస్ట్–2025 నిర్వహించారు. కమిషనరేట్ ఆఫ్ కాలేజియేట్ ఎడ్యుకేషన్, ఆంధ్రప్రదేశ్ స్టేట్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ సహకారంతో కళాశాల జవహర్ నాలెడ్జ్ సెంటర్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ డాక్టర్ ఆర్. మంజుల మాట్లాడుతూ ఉపాధి నైపుణ్యం మెరుగుపరచుకుని, ఉద్యోగావకాశాలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కళాశాల ప్లేస్‌మెంట్ అధికారి, జేకేజీ కో ఆర్డినేటర్ ఎం. విద్యాకల్పన మాట్లాడుతూ 322 మంది విద్యార్థులు పాల్గొనగా 123 మంది ఉపాధి అవకాశం పొందారని తెలిపారు. డెక్కన్ ఫైన్ కెమికల్స్ హెచ్‌ఆర్ టి. సుప్రియ, హైనెట్ ఫార్మా కంపెనీ హెచ్‌ఆర్ డీవీవీ రవివర్మ, ఇతర 13 కంపెనీలు పాల్గొని ఇంటర్వ్యూలు నిర్వహించారు. జాబ్‌ఫెస్ట్‌లో పాడేరు ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వి. చిట్టిబాబు, నర్సీపట్నం డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ఎస్. రాజు, ఎంప్లాయిమెంట్ ఎక్స్ఛేంజ్ అధికారి సీహెచ్ సుబ్బిరెడ్డి, ఏపీ స్కిల్ డెవలప్‌మెంట్ ప్లేస్‌మెంట్ ఆఫీసర్ ఎం. రమేష్‌నాయుడు, కళాశాల జేకేసీ మెంటార్లు వీఎస్ రాజు, డి. ప్రజ్ఞ, అధిక సంఖ్యలో విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యతోనే ఉన్నత భవిష్యత్



విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగిస్తున్న ముఖ్య అతిథి

అల్లిపురం: స్థానిక ప్రియాంకాస్ విద్యోదయ హైస్కూల్ గ్రాడ్యుయేషన్ డే వేడుకలు గురువారం సిరిపురంలోని గురజాడ కళాక్షేత్రంలో ఘనంగా నిర్వహించారు. యూకేజీ నుంచి 5వ తరగతి విద్యార్థులు రంగు రంగుల గ్రాడ్యుయేషన్ డ్రెస్‌లలో తమ తల్లిదండ్రుల సమక్షంలో ఉత్సాహంగా పాల్గొన్నారు. కార్యక్రమానికి కేజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ పి.శివానంద్, కస్టమ్స్ డిప్యూటీ కమిషనర్ ఎం.రవిశంకర్, ఈస్ట్ ఏసీపీ కె. లక్ష్మణమూర్తి పాల్గొన్నారు. వారు మాట్లాడుతూ విద్యతోనే ఉన్నత భవిష్యత్ సాకారం అవుతుందన్నారు. ఈ సందర్భంగా 20 సంవత్సరాలుగా స్కూలు విద్యార్థులను సురక్షితంగా చేరుస్తున్న ఆటో డ్రైవర్ వేణును సత్కరించారు. విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు కనువిందు చేశాయి. స్కూల్ డైరెక్టర్ డాక్టర్ భగీరథకుమార్ దదీచ్, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.



• భయపెడుతున్న రహదారి

టౌన్ కొత్త రోడ్డు ప్రధాన రహదారి ప్రమాదకరంగా మారింది. ఇక్కడ కాలువ వంతెన కోసం తవ్వకాలు చేపట్టారు. కొంత కాలం పని జరిగిన తర్వాత పనులు మధ్యలో ఆగిపోయాయి. దీంతో ఈ రహదారి రాకపోకలకు వీలు కాని విధంగా తయారయింది. మెయిన్‌రోడ్డు కావడం, రాకపోకలు అధికంగా ఉండడంతో ఈ దారిలో ప్రయాణించేందుకు పాదచారులు, వాహన చోదకులు భయాందోళనలకు గురవుతున్నారు.

– ఫొటో : సాక్షి ఫొటోగ్రాఫర్

పిల్లలకు సత్వర వైద్య సేవలందించండి

సీతంపేట: కంటి చూపు సమస్యలతో ఆస్పత్రికి వచ్చే పిల్లలకు సత్వర వైద్య సేవలందించాలని రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యుడు గొండు సీతారామ్ సూచించారు. బుల్లయ్య కళాశాల రోడ్డులోని ప్రభుత్వ ప్రాంతీయ నేత్ర వైద్యశాలను గురువారం ఆయన సందర్శించారు. కమిషన్ ఆదేశాలలో జనవరిలో కంటి ఆస్పత్రిలో పిల్లల కోసం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన ఓపీ, తనిఖీ గది, శస్త్ర చికిత్సల వార్డులను సూపరింటెండెంట్ డాక్టర్ వి.మీనాక్షి, ఇన్‌చార్జి ఆర్ఎంవో వాసుపల్లి శ్రీలక్ష్మితో కలిసి పరిశీలించారు. రోజూ పిల్లల ఓపీ ఎంత వస్తోంది, వారికి క్యూలైన్‌తో సంబంధం లేకుండా వైద్య సేవలు అందిస్తున్నారా తదితర విషయాలను పిల్లలను, వారి తల్లిదండ్రులను అడిగి తెలుసుకున్నారు. చికిత్స కోసం వచ్చే పిల్లలకు ప్రత్యేక ఓపీ, ప్రత్యేక తనిఖీ గదిలో సేవలందించి త్వరితగతిన పంపించే ఏర్పాట్లు పూర్తి స్థాయిలో అందేలా చూడాలని అధికారులను ఆదేశించారు. పిల్లల కోసం ప్రత్యేక ఓపీ, తనిఖీ గది ఉన్నట్టు అందరికీ తెలిసేలా బోర్డులు ఏర్పాటు చేయాలని సూచించారు. ప్రత్యేక ఓపీ, చికిత్స సేవలపై అందరికీ తెలిసేలా చర్యలు తీసుకుంటామని సూపరింటెండెంట్ డాక్టర్ వి.మీనాక్షి తెలిపారు. ఆస్పత్రి వైద్యులు, పారామెడికల్ సిబ్బంది పాల్గొన్నారు.

సిరులతల్లికి పంచామృతాభిషేకం



పంచామృతాభిషేక సేవలో కనకమహాలక్ష్మి అమ్మవారు

దాబాగార్డెన్స్: బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మి అమ్మవారి దేవస్థానంలో గురువారం త్రికాల పంచామృతాభిషేకం జరిపారు. ఈ సేవలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. ఈ పూజలో పాల్గొనదలిచే భక్తులు రూ.1,000 పూజా రుసుం చెల్లించి పాల్గొనవచ్చు. ఈ ప్రత్యేక పూజను పరోక్ష పద్ధతిలో చేసుకునే ఆసక్తి గల భక్తులు యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, టౌన్‌కొత్తరోడ్డు బ్రాంచ్, అకౌంట్ నంబరు 060810011006691, ఐఎఫ్ఎస్సీ కోడ్ యూబీఐఎన్ 0806081లో చెల్లించవచ్చు. కార్యక్రమంలో ఆలయ ఈవో కె. శోభారాణి, ఏఈవో కె. తిరుమలేశ్వరరావు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

వైద్య శిబిరానికి విశేష స్పందన



వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్ సూర్యతేజ

దాబాగార్డెన్స్: స్నేహ సంధ్య ఏజేకేర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో గురువారం పాత నగరంలోని స్వామి వివేకానంద సంస్థలో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. ప్రతి నెల రెండో గురువారం నిర్వహించే ఈ శిబిరంలో అధిక సంఖ్యలో పాత నగర వాసులు పాల్గొని పరీక్షలు చేయించుకున్నారు. డాక్టర్ సూర్యతేజ పర్యవేక్షణలో తనిఖీలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు. ఈ సందర్భంగా డాక్టర్ మాట్లాడుతూ ఎండలు తీవ్రంగా ఉన్నాయని, క్రమం తప్పకుండా మందులు వేసుకుని, సమయానికి ఆహారం తీసుకోవాలని, వ్యాయామం చేయాలని సూచించారు. ప్రతి ఒక్కరూ వైద్య శిబిరాన్ని వినియోగించుకోవాలని సంస్థ అధ్యక్షుడు సూరాడ అప్పారావు తెలిపారు. కార్యక్రమంలో పుండరీకాక్షయ్య, ప్రసాద్‌నాయుడు, కమల ప్రియ, సుమతి, సాయి తదితర వైద్య బృందం పాల్గొంది.

ఎన్నికల విధుల పారితోషికం కోరుతూ ధర్నా



జోనల్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న సూపర్‌వైజర్లు

జగదాంబ: ఎన్నికల విధులు నిర్వర్తించిన తమకు రావాల్సిన పారితోషికం చెల్లించాలని కోరుతూ జోన్–4 కార్యాలయంలో సూపర్‌వైజర్లు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 2021 నుంచి 24 మంది ఎన్నికల్లో సూపర్‌వైజర్లుగా విధులు నిర్వర్తించినట్లు తెలిపారు. ఒక్కొక్క సూపర్‌వైజర్‌కు రూ. 48 వేలకు పైగా పారితోషికం వస్తుందన్నారు. ఇప్పటికి అయిదేళ్లు అవుతున్నా తమకు రావాల్సిన నగదు రాలేదన్నారు. ఈ నేపథ్యంలో గురువారం బూత్ లెవల్ అధికారుల అవగాహన కార్యక్రమాన్ని బహిష్కరించి ధర్నా చేస్తున్నామన్నారు. ఎన్నికల కమిషన్ వెంటనే స్పందించి తమకు పారితోషికం ఇప్పించాలని కోరారు.

జోన్–4 ఒక్కరోజు ఆదాయం రూ. 1.16 కోట్లు



పన్ను చెల్లింపుల తీరును పరిశీలిస్తున్న జెడ్సీ మల్లయ్యనాయుడు

జగదాంబ: జోన్ పరిధిలో ఇంటి, ఖాళీ స్థలాల పన్నుపై వడ్డీ 5 శాతం తగ్గింపును అందరూ వినియోగించుకోవాలని జోనల్ కమిషనర్ ఎం.మల్లయ్యనాయుడు అన్నారు. గురువారం ఆయన రెవెన్యూ అధికారులు, ఎడ్మిన్ సెక్రటరీలు, ట్యాక్స్ కలెక్టర్లతో సమావేశం నిర్వహించారు. ఈ ఏడాది ప్రభుత్వం పన్నులపై కల్పించిన రాయితీని ప్రజలకు వివరించి నగరాభివృద్ధిలో వారిని భాగస్వామ్యం చేయాలన్నారు. గురువారం ఒక్కరోజే రూ. 1 కోటి 16 లక్షల ఆదాయం చేకూరిందని జెడ్సీ తెలిపారు. 2024–25 సంవత్సరానికి అధిక మొత్తంలో పన్ను వసూలు చేసిన సెక్రటరీలను అభినందించారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ అధికారులు అప్పలరాజు, సీతారామయ్య, సెక్రటరీలు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా జాతీయ సర్వే దినోత్సవం



కనకబాబును సన్మానిస్తున్న సర్వేయర్లు

మహారాణిపేట: రీ సర్వే కార్యక్రమంలో సర్వేయర్లు చురుగ్గా పాల్గొంటున్నారని ఆంధ్రప్రదేశ్ సర్వే ఎంప్లాయీస్ అసోసియేషన్ విశాఖ జిల్లా అధ్యక్షుడు పంపాన కనక బాబు అన్నారు. గురువారం కలెక్టరేట్ ఆవరణలో ఉన్న విశాఖ జిల్లా ఆంధ్రప్రదేశ్ సర్వే ఎంప్లాయీస్ అసోసియేషన్ విశాఖ జిల్లా కార్యాలయంలో ఘనంగా జాతీయ సర్వే దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా విశాఖ జిల్లావ్యాప్తంగా ఉన్న గ్రామ సర్వే అధికారులను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా కనకబాబు మాట్లాడుతూ సర్వేయర్లను అభినందించారు. సర్వేకు సహకరిస్తున్న ప్రజలకు ఆయన ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా అసిస్టెంట్ డైరెక్టర్లు విజయకుమార్, సూర్యారావు తదితరులు అందించిన సహకారాన్ని కనకబాబు కొనియాడారు. ఈ కార్యక్రమంలో భీమిలి మండల్ సర్వేయర్లు పైడిరాజు, కృష్ణారావు, రమేష్, పద్మనాభం మండల సర్వేయర్లు హరీష్, లీల, వెంకటేశ్వరరావు, సూర్య భగవాన్, శివాజీ, రామకృష్ణ, పెందుర్తి మండల సర్వేయర్లు రాజగోపాల్, రమేష్, శ్యాం సుందర్, రామచంద్రమూర్తి, డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ సర్వేయర్స్ లక్ష్మణరావు, చంద్రశేఖర్, సూర్యభగవాన్ తదతరులు పాల్గొన్నారు.

ఫిషింగ్ హార్బర్‌ను సందర్శించిన విద్యార్థులు



మత్స్యశాఖ జాయింట్ డైరెక్టర్ కార్యాలయాన్ని సందర్శిస్తున్న విద్యార్థులు



ఫిషరీస్ సర్వే ఆఫ్ ఇండియా కార్యాలయంలో ల్యాబొరేటరీని పరిశీలిస్తున్న విద్యార్థులు

మహారాణిపేట: రాష్ట్ర మత్స్య సాంకేతిక సంస్థ (కాకినాడ)లో శిక్షణ పొందుతున్న విద్యార్థులు గురువారం విశాఖ ఫిషింగ్ హార్బర్‌ను సందర్శించారు. మూడు రోజులుగా విద్యార్థులు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ మత్స్య సంస్థలు, ఇతర కార్యాలయాలను సందర్శించి అక్కడ నిర్వహిస్తున్న కార్యక్రమాల గురించి తెలుసుకున్నారు. పలు అంశాలపై అధ్యయనం చేశారు. ఈ సందర్భంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేపట్టిన పలు సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాల గురించి మత్స్యశాఖ జాయింట్ డైరెక్టర్ పి.లక్ష్మణరావు విద్యార్థులకు వివరించారు. రాష్ట్ర మత్స్య సాంకేతిక సంస్థ అడిషనల్ డైరెక్టర్ ఎ.చంద్రశేఖర్ రెడ్డి వివిధ పథకాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో మత్స్యశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ విజయకృష్ణ, సిబ్బంది లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.